క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా న్యాయ శాఖ ఉద్యోగుల సంఘం–2023 క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక ఆమె చాంబర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వరప్రసాద్, ఎ. వేణుగోపాల్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

అగరుబత్తీ స్టాల్ ప్రారంభం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన అగరుబత్తీ స్టాల్‌ను శనివారం ప్రారంభించారు. స్టాల్ నిర్వాహకుడు రాజేష్ మాట్లాడుతూ స్వామివారికి అలంకరించే పూలు, తమలపాకులను వృథా చేయకుండా వాటితో అగరుబత్తీలను తయారు చేస్తామన్నారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అగరుబత్తీలను తయారు చేసి భక్తులకు అందుబాటులో ఉంచామని వివరించారు.

భావనాఋషి విగ్రహ ప్రతిష్ఠ

కోడూరు: భద్రావతి సమేత భావనాఋషి స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ కనుల పండువగా నిర్వహించారు. ఆరో వార్డులో నూతనంగా నిర్మించిన ఆలయంలో భావనాఋషి స్వామి విగ్రహాన్ని శనివారం ఉదయం 9.39 గంటలకు ప్రతిష్ఠించారు. ఉపాలయంలో లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠ కూడా జరిగింది. అనంతరం స్వామివార్ల శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు స్వామివార్లను దర్శించుకొని పూజలు చేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మచిలీపట్నంటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పదో డివిజన్‌లో ఆది వారం ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని కార్పొరేటర్ షేక్ ముంతాజ్‌బేగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ పాల్గొంటారన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి వేడుకలు

బంటుమిల్లి: స్థానిక పద్మావతీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ప్రధాన మూర్తులకు విశేష పూజలు జరిగాయి. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాలు ఎన్ఆర్ఐ సీహెచ్ సుబ్బారావు దంపతుల సారథ్యంలో జరిగాయి. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యదేవునికి అభిషేకాలు..

మచిలీపట్నంటౌన్: రథసప్తమి పర్వదినాన్ని నగరంలోని పలు దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ఉన్న దేవతామూర్తులతో పాటు సూర్యదేవుడిని దర్శించుకున్నారు. సూర్యభగవానునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కన్యకా పరమేశ్వరి ఆలయంలోని సూర్యభగవానునికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం సూర్య భగవానునుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి ఎంపీ బాబాప్రసాద్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. బచ్చుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లను సూర్యప్రభ వాహనం, శేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, సర్వభూపాల వాహనం, అశ్వ వాహనం, చంద్రప్రభ వాహనాలపై వీధుల్లో ఊరేగించారు. తిరుమలలో జరిగే విధంగా తొలిసారిగా మచిలీపట్నంలోని బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తేవి రవికాంత్, సభ్యులు, కార్య నిర్వహణాధికారి చక్రధరరావు, తరకటూరు ఎంపీటీసీ జక్కా ధర్మారాయుడు తదితరులు పర్యవేక్షించారు. బలరామునిపేటలోని యతిరాజ భవనంలో రథసప్తమి పూజలు నిర్వహించారు.



బంటుమిల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



బందరులో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి వారు

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

సామాజిక తనిఖీ ప్రజా వేదికలో పీఓ వెంకటలక్ష్మి

పెడన: ఉపాధి హామీ పనుల విషయంలో బాధ్యతారాహిత్యంగా ఉంటే ఎలా.. ఆ విధంగా పనిచేస్తే మీరెందుకున్నట్లు.. సిబ్బంది బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని డ్వామా ఫైనాన్షియల్ మేనేజర్, సామాజిక తనిఖీ ప్రజావేదిక ప్రొసీడింగ్ అధికారి (పీఓ) పి. వెంకటలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 2020–21, 2021–22 సంవత్సరాలకు సంబంధించి ఉపాధి హామీ పనులు, పంచాయతీరాజ్, అటవీశాఖ పనులపై ఆడిట్ అభ్యంతరాలు స్వీకరించారు. పనుల తీరుపై ఫీల్డ్ అసిస్టెంట్లను, సీఓను ప్రశ్నించారు. ఉపాధి హామీ పనులు రెండేళ్లకు 1,513 పనులకు గాను రూ.9.13 కోట్లు వేతనాలు, మెటీరియల్ కింద అందజేశామని చెప్పారు. వీటిల్లో 670 పనులకు సంబంధించి రూ.58,280లు రికవరీ పెట్టామని చెప్పారు. ఆమె మాట్లాడుతూ కూలీలకు సంబంధించి జాబ్‌కార్డులు సొంతంగా తయారు చేసి లామినేషన్ చేసి ఇచ్చేలా చూడాలన్నారు. కూలీల సంఖ్య, పనులను పెంచాలని సూచించారు. కాలనీలు పూర్తయిన చోట మొక్కలను లబ్ధిదారులకు అందజేసి పెంపకం బాధ్యతలను కూడా వారికి ఇవ్వాలన్నారు. పంచాయతీరాజ్ పనులు ఇంకా ప్రారంభించకపోవడంపై సంబంధిత ఏఈకి షోకాజ్ నోటీసులు ఇవ్వాలన్నారు. పంట పొలాల వద్ద నీటి కుంటలను ఏర్పాటు చేసిన తరువాత రొయ్యల చెరువులుగా మార్చడాన్ని తప్పుబట్టారు. తక్షణం వాటిపై తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ మన్మధరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, గరికిపాటి వెంకట రామానాయుడు, ఈఓపీఆర్డీ జయరాము తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

చిలకలపూడి(మచిలీపట్నం): చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. స్థానిక క్రాసా కార్యాలయంలో మహిళా వలంటీర్లకు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ మహిళలకు ఉన్న చట్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. చిన్నపిల్లలు తప్పిపోతే వారిని ఏ విధంగా గుర్తించి ఎవరికి అప్పగించాలనే విషయాలను వివరించారు. బాల్య వివాహాలు నేరమని, అటువంటి వివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. వివాహం జరిగిన మహిళలు వేధింపులకు గురైతే చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. గృహ హింస చట్టం, వరకట్న వేధింపులు తదితర అంశాలను వివరించారు. న్యాయవాది చీలి మునలయ్య, క్రాసా ప్రతినిధి ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

కృత్తివెన్ను: కృత్తివెన్ను పీహెచ్‌సీ పరిధిలోని వాలంక గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను శనివారం ప్రారంభించారు. ప్రథమ చికిత్సతో పాటు, షుగర్, బీపీ, అన్ని రకాల సాధారణ వ్యాధులకు ఈ క్లినిక్ ద్వారా చికిత్స అందుతుందని పీహెచ్‌సీ వైద్యులు సందీప్ తెలిపారు. ఈ క్లినిక్‌లో ప్రత్యేకంగా ఒక ఎంఎల్‌హెచ్‌పీ ఉంటారని, వారు వైద్య పరీక్షలు నిర్వహించి అత్యవసరమైతే పీహెచ్‌సీకి సిఫారసు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ సుహాసిని, ఎంపీటీసీ విజయకుమారి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు శేఖర్, వీరబాబు పాల్గొన్నారు.

త్వరలో విద్యుత్ లైన్లు ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



చల్లపల్లి: జగనన్న కాలనీల్లో మౌలిక సౌకర్యాల కల్పన పనులను వేగవంతం చేస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక జగనన్న కాలనీలో విద్యుత్ లైన్ల పనులు పూర్తి కాగా ఎమ్మెల్యే పరిశీలించి మాట్లాడారు. పేదల పట్ల చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో 31 లక్షల నివేశన స్థలాలు కేటాయించి పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేశారని చెప్పారు. విద్యుత్ శాఖ ఈఈ సీహెచ్ రాంభొట్లు మాట్లాడుతూ ఈ కాలనీలో 250 విద్యుత్ స్తంభాలు వేసి, 100 కేవీ సామర్థ్యం కలిగిన ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. వీధిలైట్ల పనులు కూడా పూర్తయ్యాయని, త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సింహాద్రి వికాస్‌బాబు, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, చల్లపల్లి డీఈఈ పులి శివనాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

రాయవరంలో నేత్ర వైద్య శిబిరం

గూడూరు: విజయవాడకు చెందిన శ్రీనయన కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం రాయవరం గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 130 మంది రోగులకు డాక్టర్ ఎం.కిరణ్మయి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. సర్పంచి నందం మల్లీశ్వరి, పీఏసీఎస్ చైర్మన్ కోళ్ల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మినుము పైరు పరిశీలన

పెడన: రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌వైవీఎస్ మనోహరరావు అన్నారు. శనివారం ఆయన జిల్లా వనరుల కేంద్రం, ఆత్మ సిబ్బందితో నందిగామ గ్రామంలో పర్యటించి మినుము పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. శాస్త్రవేత్త జి. లహరి, ఏడీఏ పాల్గొన్నారు.

మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: మచిలీపట్నం ఎంపీ బాలశౌరికి, తనకు మధ్య ఎలాంటి విభేదాలు లేవని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయలంకలో చిన్న తోపులాట ఘటనను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీలో ఇరువర్గాలు దాడులు చేసుకున్నట్లు కొన్ని ఛానల్స్‌లో ప్రసారం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీ బాలశౌరి వెంట వచ్చిన గరికపాటి శివ వైఎస్సార్ సీపీలో ఉంటూ టీడీపీ నాయకులకు అనుకూలంగా పనిచేస్తున్నాడని చెప్పారు. ఈ విషయాన్ని మావాళ్లు కొంతమంది అడిగినందుకు వారితో వాదులాట జరిగిందని చెప్పారు. శివ నోటి దురుసు వల్లే ఇలా జరిగిందని, కావాలనే లేనిపోని ఆరోపణలు చేస్తూ గొడవలు సృష్టిస్తున్నారన్నారు. నాగాయలంకలో నాబార్డు ద్వారా 2,600 మంది మత్స్యకారులకు రూ.6 కోట్ల రుణాలు అందించే గొప్ప కార్యక్రమం విజయవంతం కావడంతో ఓర్వలేని కొన్ని ఛానల్స్ ఈ చిన్న ఘటనను చిలువలు పలువలు చేసి చూపిస్తున్నాయన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వసంతోత్సవం జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సుబ్రహ్మణ్య మాల దీక్ష విరమణ చేసిన అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం వేద విద్వత్ సభ నిర్వహించారు. 40 మందికి పైగా వేద పండితులు పాల్గొని చతుర్వేద పారాయణం ఆలపించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

కోనేరుసెంటర్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి గ్రామ కన్వీనర్లు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ బందరు నియోజకవర్గం కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్ తెలిపారు. బందరు మండలం పొట్లపాలెం గ్రామంలో శనివారం రవిశంకర్ ఆధ్వర్యంలో ఇద్దరు కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొట్లపాలెం మాజీ సర్పంచ్ గాజుల నాగరాజు, చిలకలపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు బోయిన నాగబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

కోనేరుసెంటర్: బందరు మండలంలో మండలంలోని పలు గ్రామాల్లో సారా స్థావరాల కోసం గాలిస్తున్న రూరల్ సీఐ రవికుమార్‌కు తాళ్లపాలెం గ్రామ శివారు ముళ్లపొదల మధ్య ఓ వ్యక్తి సారా కాస్తున్నట్లు సమాచారం అందింది. రూరల్ ఎస్ఐ చాణక్య, సిబ్బందితో కలిసి దాడి చేశారు. సారా తయారు చేస్తున్న బెజవాడ ఏడుకొండలును అదుపులోకి తీసుకున్నారు. 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బంటుమిల్లి: పెదతుమ్మిడి గ్రామానికి చెందిన వీరంకి బ్రహ్మం (36) విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 23వ తేదీన కుటుంబ వివాదాల నేపథ్యంలో బ్రహ్మం ఎలుకల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

తహసీల్దార్, వీఆర్వోలకు సన్మానం

మోపిదేవి: మోపిదేవి తహసీల్దార్ కె. నవీన్‌కుమార్, మోపిదేవి గ్రామ సచివాలయం–2 వీఆర్వో మూర్తిలను తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు శనివారం ఘనంగా సన్మానించారు. ఉత్తమ సేవలు అందించినందుకు గాను వీరు రిపబ్లిక్ డే సందర్భంగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ శివరామకృష్ణ, వీఆర్వోలు ప్రశాంత్, నీల్‌కాంత్, గోపాలకృష్ణ, శ్రీనివాస్, రమణ, సుబ్బారావు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి (పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ ప్రారంభించారు. 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. 90 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ మంజూష వైద్య సేవలు అందించారు. కంటి ఆస్పత్రి క్యాంప్ మేనేజర్ నాగబాబు, కనిగంటి వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యవసాయ కూలీ మృతి

మోపిదేవి: గొల్లపాలెంకు చెందిన వ్యవసాయ కూలీ పెద్దిబోయిన గోవిందరాజులు (45) శనివారం పాముకాటుకు గురై మృతిచెందాడు. ఉదయం మినుము పంటపై పురుగుమందు పిచికారీ చేస్తుండగా గోవిందును విషసర్పం కాటు వేసింది. సమీపంలో ఉన్న రైతులు గమనించి 108 వాహనం ద్వారా అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

కోడూరు: కోట రాఘవయ్య విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండల స్థాయి క్రీడా పోటీలను శనివారం ఎంఈఓ టీవీఎం రామదాసు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, చెస్, షటిల్ పోటీలు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రెండు రోజులు జరుగుతాయి. విద్యాసంస్థల గౌరవ సలహాదారు కోట వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు పాల్గొన్నారు.

సింధు స్నానాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

కోడూరు: మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని హంసలదీవి సాగరతీరంలో ఫిబ్రవరి 5న నిర్వహించే సింధు స్నానాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సింధు స్నానాలకు ఏర్పాట్లపై సమీక్ష ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సింధుస్నానాలను విజయవంతం చేయాలని సూచించారు.